క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కారెంపూడి: అంతర జిల్లాల వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబర్చి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన మండలంలోని పెద కొదమగుండ్ల జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి శ్యాంప్రకాష్‌కు గురువారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్యాంప్రకాష్ అండర్ 17 వాలీబాల్ బాలుర ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి పోటీలలో ద్వితీయ స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. అలాగే విద్యార్థికి శిక్షణ ఇచ్చిన పాఠశాల పీఈటీ కాశేశ్వరరావును హెచ్ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మెప్మా బజార్ ఉపయోగకరం



మాచర్ల: పట్టణంలోని వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు వారి ఇళ్ళ వద్ద తయారు చేసిన వంటకాలు, వివిధ సామగ్రి, దుస్తులు, ఫ్లవర్ వాజ్‌లతోపాటు అనేక రకాల ఉత్పత్తులతో మెప్మా బజార్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అన్నా క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించేందుకు బజార్ ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు మేనేజర్ రాజశేఖర్, సీఓ అంజలి, ఆర్‌పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



ఎస్టీ కాలనీలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్

పిడుగురాళ్ల: పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించేలా శానిటేషన్ అధికారులు పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఎస్టీ కాలనీలో గురువారం ఉదయం పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో శివారు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా చుట్టు పక్కల ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు పెరగకుండా చూసుకోవటంతోపాటు, నీటి నిల్వలు లేకుండా చూడాలని, మురుగునీటి పారుదల ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

జెడ్పీ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



రెంటాల(రెంటచింతల): రెంటాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెంటచింతల ఎంఎల్ఆర్ ఫౌండేషన్ వారు కంప్యూటర్‌ను బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం ఏవీ నాగ వీరయ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించడానికి ఎంఎల్ఆర్ ఫౌండేషన్ వారు ముందుకు వచ్చి చేయుతనందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ మేనేజర్ కె.కళ్యాణ్, ఉపాధ్యాయులు ఓర్సు సాగర్ బాబు, వెన్నా బిచ్చిరెడ్డి, పీసీహెచ్ నాసరయ్య, జి. లింగారెడ్డి, జె. మల్లిర్జునరావు, ఎస్. మల్లికార్జున, ఆర్.బ్రహ్మయ్య, వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

మాచర్లలో రాష్ట్రస్థాయి మెగా బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల: పట్టణంలోని నెహ్రూనగర్ సమర్పణ చర్చి ఆవరణలో డిసెంబర్ 14న రాష్ట్రస్థాయి మెగా బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శంకర్, ప్రోగ్రాం పర్యవేక్షకులు బ్రహ్మనాయుడు తెలిపారు. గురువారం వారు చర్చి ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ బైబిల్ పోటీల వివరాలు తెలిపారు. బైబిల్ గ్రంథంలోని అపోస్తులు, ఫిలిప్పీ పత్రికపై ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలకు ముగ్గురు చొప్పున బృందంగా రూ.వంద చెల్లించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 6362218163, 9866372314 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

కలుపు మంట



మిర్చి పంటలో కలుపుతీస్తున్న కూలీలు

- కలుపుతీతకు రూ.వేలల్లో అదనపు ఖర్చు
- పెరిగిన పెట్టుబడితో రైతుల ఆందోళన
- ఇప్పటికే వర్షాలతో నష్టం

రెంటచింతల: పత్తి, మిరప పంటల్లో పెరుగుతున్న కలుపు రైతుకు మంట పుట్టిస్తోంది. పెరిగిన అదనపు పెట్టుబడి ఖర్చులు కంట కన్నీరు తెప్పిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి, మిరప పంటలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటలను కాపాడుకునేందుకు కర్షకులు అష్టకష్టాలు పడ్డారు. చేల నుంచి ముంపునీరు తొలగించుకునేందుకు తీవ్రంగా శ్రమించారు. ఎలాగోలా పంటను బతికించుకుందామనుకున్న సమయంలో ఇప్పుడు కలుపు రైతులను వేధిస్తోంది. ఈ ఏడాది మండలంలో 17,797 ఎకరాలలో పలు రకాల పంటలు సాగవుతున్నాయి. దీనిలో పత్తి 4,069 ఎకరాలు, మిర్చి 5,621 ఎకరాలు, వరి 5,728 ఎకరాలు, కంది 2,097 ఎకరాలు, మొక్కజొన్న ఇతర మిగిలిన వివిధ రకాల పంటలు 282 ఎకరాలలో సాగవుతున్నాయి. పత్తి, మిరప చేలల్లో ఇటీవల కాలంలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. వర్షాల వల్ల భూమిలో తడి ఉండి కలుపు తీయడానికి రైతులకు ఇబ్బందిగా మారింది. దీంతో కలుపు మొక్కలు పంటను మించి ఏపుగా పెరిగాయి. ఇప్పుడు కలుపు తీతకు కూలీలపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల ఎకరాకు రూ.4వేల అదనపు ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కలుపు తీత భారంగా మారింది



వరుసగా కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది 3 ఎకరాలలో మిర్చి పంటను సాగు చేస్తున్నా. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కలుపు బాగా పెరిగింది. దీనిని తీయించడానికి ఎకరాకు రూ.4 వేలు అదనపు ఖర్చు అవుతోంది. ఈ ఏడాది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇప్పటి వరకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా ఇస్తానన్న రూ.20,000 మంజూరు చేయలేదు.

– పులి ఓబుల్‌రెడ్డి, రైతు, రెంటచింతల

కౌలు రైతుల పరిస్థితి దారుణం



నేను 6.5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట వేశాను. ఇటీవల కురిసిన వర్షాలకు కలుపు బాగా పెరిగింది. తీయడానికి సుమారు రూ. 25 వేల అదనపు భారం పడింది. మండలంలో 80 శాతానికిపైగా కౌలు రైతులు ఉన్నారు. మా పరిస్థితి దయనీయంగా ఉంది. పంటలు సాగు చేయడానికి అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువుల ధరలతో పాటు కూలీల కూలీ కూడా పెరగడంతో దిక్కుతోచడం లేదు.

– తన్నీరు అంజి, కౌలు రైతు, రెంటచింతల

సాగునీటి కాలువలకు మరమ్మతులు



నాడు : గుర్రపు డెక్క ఆకులతో నిండిన గొట్టిముక్కల మేజర్ కాలువ



నేడు : గొట్టిముక్కల మేజర్‌ను అభివృద్ధి చేయడంతో దిగువకు పారుతున్న సాగునీరు

సాక్షి ఎఫెక్ట్

రెంటచింతల: డెక్క, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన సాగునీటి కాలువలకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఈనెల 13న సాక్షి దినపత్రికలో అలకించే నాథు'డెక్క'డ! శీర్షికన కాలువల దుస్థితిపై ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మండలంలోని పలు మేజర్ కాల్వల అభివృద్ధి పనులు చేపట్టారు. మిగిలిన కాల్వల అభివృద్ధి పనులనూ త్వరలో పూర్తిచేస్తామని ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌రావు తెలిపారు.

కారెంపూడిలో ఆధార్ సేవల ప్రత్యేక క్యాంపు

కారెంపూడి: ఆధార్ ప్రత్యేక సేవలు కారెంపూడి గ్రామ సచివాలయం-2లో గురువారం ప్రారంభమయ్యాయి. శుక్రవారం కూడా సేవలు కొనసాగుతాయని పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్ తెలిపారు. కొత్త ఆధార్ కార్డుల కోసం, బయో మెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్‌ల మార్పులు చేర్పులు, వయస్సు తేడా ఉన్నా, అలాగే పేరు మార్పు, ఫోన్ నంబర్ అప్‌డేట్ సేవలు ఆపరేటర్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు జారీ చేస్తారని తెలిపారు. ఆధార్ కార్డు లేని వారు, సమస్యలు ఉన్న వారు క్యాంపునకు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

సఖి సెంటర్‌ను వినియోగించుకోండి

గురజాల : సఖి సెంటర్‌ను ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొడుకులు, కూతుళ్లు వదిలి పెట్టి ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, రాత్రి వేళ ప్రయాణించే మహిళలు, భార్యాభర్తల గొడవలు, అసభ్య ప్రవర్తన, ఫోన్‌కాల్స్‌తో ఇబ్బంది పడుతున్న మహిళలు సఖి సెంటర్‌ను సంప్రదించాలన్నారు. సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. వర్కర్ పి.స్రవంతి, జి.నవీనా, సీహెచ్ సుప్రజా భాయ్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై ర్యాలీ

పిడుగురాళ్ల: పట్టణంలోని కేఎస్ఆర్ విద్యా సంస్థలు, కొండమోడులోని పీఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. అక్టోబర్ 24న ప్రపంచ పల్స్ పోలియో దినోత్సవమని, దీనిలో భాగంగానే ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ గర్రె సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, నీరుమళ్ల రాజేష్, ఆత్మకూరి గురవయ్య, కాకుమాను శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, బాడిశ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

పిడుగురాళ్ల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పిడుగురాళ్ల పట్టణంలో గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని రజక కాలనీకి చెందిన పొత్తూరి వెంకటేశ్వర్లు జానపాడు రోడ్డులో మద్యం దుకాణాలు తెరవకముందే అనుమతి లేని 40 మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న సమయంలో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



చెస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం



సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం

మాచర్ల: పట్టణానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు చెస్, సాఫ్ట్ బాల్‌లో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో చెస్ టోర్నమెంట్ ఈనెల 14న స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఎస్.దీక్షితారెడ్డి రాష్ట్ర స్థాయిలో చెస్ టోర్నమెంట్‌కు ఎంపికైంది. ఈ నెల 28, 29 తేదిలలో అనంతపురం జిల్లా లేపాక్షిలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో దీక్షితా రెడ్డి పాల్గొంటుంది. దీంతో గురువారం స్కూల్లో దీక్షితారెడ్డిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్లు శివ, శ్రీధర్, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు. అలాగే ఈనెల 19న నర్సరావుపేట ఎస్ఎస్ఎన్ కాలేజీలో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 14 సాఫ్ట్ బాల్ పోటీల్లో మాచర్ల పట్టణానికి సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎం.విజయలక్ష్మి, ఉపేందర్‌కుమార్, విశ్వక్, కార్తికేయరెడ్డి ఎంపికయ్యారు. వీరు రాష్ట్ర స్థాయిలో నవంబర్ 16,17,18 తేదిలలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని గురువారం స్కూల్లో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తుమ్మా సుజాత, పీఈటీ ఎం.కుమార్ ప్రతాప్, సంతోష్, విలియమ్స్ పాల్గొన్నారు.

వేతనాలు, సెలవులు అమలు చేయాలి

ధర్నా చేసిన మున్సిపల్ కార్మికులు



ధర్నా చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్లు, సెమిస్కిల్లు, అన్‌స్కిల్ట్ వేతనాలు, వారాంతపు, పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమని, వాటిని వెంటనే అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్మికుల మచ్చర్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. కార్మికులకు జీతాలతో పాటు ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, కార్యదర్శి సోమశేఖర్, కుంచాల శ్రీను, బాలాజీ సింగ్ నాయకత్వం వహించారు.

రిలేదీక్ష శిబిరానికి సంఘీభావం

రాజకీయ కారణాలతో టీడీపీ కూటమి నాయకులు అన్యాయంగా తొలగించిన ఇంజనీరింగ్ విభాగ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా రిలేదీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి తమ సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ ఒకేపార్టీలో ఉండాలనే నిబంధన ఏదీ ఉండదన్నారు. ఎవరికి తోచిన పార్టీలో వారు ఉంటారని, వారు తమ పార్టీవారు కాదనే ఉద్దేశ్యంతో విధుల నుంచి చిరుద్యోగులను తొలగించటం దారుణమని అన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, పౌరహక్కుల సంఘ జిల్లా కార్యదర్శి శికినం చిన్న పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి నీలావతి

నాదెండ్ల: ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాలు సాధించే దిశగా అదనపు తరగతులు, అంతర్గత పరీక్షల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని పల్నాడు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి ఎం.నీలావతి చెప్పారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మొదటి, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగుల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని గణపవరం సీఆర్ కాలేజీ, చిలకలూరి పేటలోని ఏఎంజీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. స్వంత ఖర్చులతో విద్యార్థినులకు యూనిఫాం అందించిన పీజీటీ టీచర్లను ఆమె అభినందించారు. అనంతరం ఆమెను హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

పేటీఎం మిషన్లతో స్త్రీనిధి రుణాలు చెల్లింపులు

జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చిన బుల్లెయ్య

శావల్యాపురం: స్త్రీనిధి రుణాలు చెల్లింపులకు పేటీఎం మిషన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు రంతు చిన బుల్లెయ్య సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సమాఖ్య సంఘాలకు పేటీఎం మిషన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి రుణాలు రూ.120 కోట్లు 24 వేల మంది మహిళా సంఘాల్లోని సభ్యులకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు 2640 మంది సభ్యులకు రూ.19 కోట్ల 50 లక్షల రుణాలను పారదర్శకంగా అందజేశామన్నారు. స్త్రీనిధి రుణాలు చెల్లింపులో అవకతవకలకు తావులేకుండా ఉండటానికి నగదు రహిత ఆర్థిక లావాదేవీలు నిర్వహించడానికి ఒక్కో మండలానికి 10 పేటీఎం మిషన్లు గ్రామ సమాఖ్య సంఘాలకు అందజేస్తున్నట్లు తెలిపారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలని అలాగే నగదు చెల్లింపులు చేయగానే రసీదులు తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా సంఘాల్లోని సభ్యులకు పేటీఎం మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు, సీసీ ఖాజావలీ మహిళా సభ్యులు ఉన్నారు.

బిడ్డా లేవరా.. కాలేజీకి పోదువు

- డయేరియాతో మరణించిన కొడుకు మృతదేహం వద్ద తల్లి రోదన
- ఎదిగిన కొడుకు చనిపోవడంతో ఆర్తనాదాలు
- సొమ్మసిల్లి పడిపోయిన వైనం
- దాచేపల్లి అంజనాపురం కాలనీలో విషాదఛాయలు



కుమారుడు వెంకటేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి శివకుమారి

దాచేపల్లి : ''బిడ్డా లేవరా.. కాలేజీకి పోదువు.. ఇక నుంచి నేను పొద్దునే కాలేజీకి పంపేందుకు ఎవర్ని లేపాలిరా.. రేయ్ వెంకటేష.. అయ్యా లేవరా.. నా బంగారు కొండ.. మీ అమ్మ పిలుపు నీ చెవిన పడటంలేదా.. నాయనా ఒక్కసారి లేవరా.. అయ్యో భగవంతుడా నా కడుపు కోశావు కదయ్యా'' అంటూ ఆ తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురానికి చెందిన తమ్మిశెట్టి కృష్ణంరాజు, శివకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, పెద్దకుమారుడైన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ డిగ్రీ మూడో సంవత్సరం మాచర్ల ఎస్‌కేబీఆర్ కాలేజీలో చదువుకుంటున్నాడు. క్వారీ పనులు చేసుకుంటూ బిడ్డను తల్లిదండ్రులు చదివించుకుంటున్నారు. ఇంటి వద్ద నుంచే వెంకటేష్ కాలేజీకి వెళ్లేవాడు. ప్రతి రోజూ తల్లి వెంకటేష్‌ని లేపి భోజనం తయారు చేసి కాలేజీకి పంపించేది. డయేరియా బారిన పడిన 12 గంటల వ్యవధిలోనే చేతికి అందివచ్చిన కుమారుడు వెంకటేష్ మృత్యువాతపడటంతో ఆ తల్లిదండ్రుల అర్తనాదాలు మిన్నంటాయి. కొడుకు మృతదేహం వద్ద తల్లి రోదించిన తీరును చూసి అక్కడున్న వారంతా కన్నీంటిపర్యంతమయ్యారు. తల్లి శివకుమారిని ఓదార్చటం ఎవరి తరమూ కాలేదు. కుమారుడి మృతదేహం వద్ద వెక్కివెక్కి ఏడ్చిన శివకుమారి సొమ్మసిల్లిపడిపోయింది. వైద్యసిబ్బంది ఆమెకు వైద్య సేవలు అందించారు. వెంకటేష్ మృతితో అంజనాపురం కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటేష్‌తో పాటుగా చదువుకునే తోటి విద్యార్థులు వచ్చి మిత్రుడి మృతదేహాన్ని కడసారి చూసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

డయేరియా బాధితులకు పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న కమిషనర్ డాక్టర్ సిరి

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియా బాధితులను కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ డాక్టర్ ఎ.సిరి గురువారం పరామర్శించారు. కాలనీలో డయేరియా బారిన పడిన బాధితులతో మాట్లాడి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అనంతరం వైద్యశిబిరాలను సందర్శించారు. బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ నెల 22 నుంచి డయేరియా కేసులు నమోదవుతున్నాయని, బాధితుల కోసం దాచేపల్లి పీహెచ్‌సీలో అదనంగా 8 పడకలు ఏర్పాటు చేసి, ముగ్గురు డాక్టర్లను ప్రత్యేకంగా కేటాయించామని ఆమె చెప్పారు. అంజనాపురంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాల్లో నలుగురు డాక్టర్లు వైద్యసేవలు అందిస్తున్నారని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి డయేరియా బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. గురజాల హాస్పిటల్‌లో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేసి వైద్యులను కేటాయించామని, డయేరియా బారినపడి వారంతా తక్షణమే హాస్పిటల్‌కి వెళ్లి వైద్యసేవలు పొందాలన్నారు. కలుషిత నీరు తాగకుండా సురక్షిత నీరు మాత్రమే వాడాలని డాక్టర్ సిరి చెప్పారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ రవి, డాక్టర్లు అమూల్య, మధు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి : డయేరియా బాధితులకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చెప్పారు. నగర పంచాయతీలోని అంజనాపురం కాలనీలో డయేరియా బాధితులను కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని గురువారం పరామర్శించారు. డయేరియా వ్యాప్తికి గల కారణాలను అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. డయేరియాతో మృతిచెందిన కుటుంబాలను ఆదుకుంటామని, ప్రభుత్వపరంగా సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా రాక్ శాండ్ ఫిల్టర్ విధానం ద్వారా తాగునీటిని ప్రజలకు అందిస్తామని, ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే యరపతినేని చెప్పారు. ఆయన వెంట నాయకులు బెల్లంకొండ బద్రి, అంబటి శేషగిరిరావు, వేముల తిరుమలకుమార్, నర్రా పుల్లయ్య, సొసైటి నారాయణ, తోట వెంకటేశ్వర్లు, ముశ్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవికుమార్



రవికుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ సాంఘిక, నాటక రంగస్థల కళాకారుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింగర్ రవికుమార్ (బాజీ)ని ఎంపిక చేసి నియామక పత్రం అందజేసినట్లు జాతీయ సాంఘిక, నాటక రంగస్థల కళాకారుల సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు చెప్పారు. గురువారం ఆయన కార్యాలయంలో ఎంపికైన రవికుమార్‌కు నియామక పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నాటక రంగస్థల కళాకారుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుర్గెంపూడి రామకోటిరెడ్డి, కందుకూరి నాసరయ్య, వెంకటేశ్వర్లు, మాస్టర్ దేరంగుల గురవయ్య, రాయపాటి ప్రసాద్, ఆలేటి రత్నం, ఆదిరాల సుందరరావు, రమావత్ మాంగోబాయిలు పాల్గొని రవి కుమార్‌ను అభినందించారు.

ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు చేయాలి



మద్యం సీసాను పరిశీలిస్తున్న సీఐ దేవర శ్రీనివాసరావు

శావల్యాపురం: మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు చేయాలని వినుకొండ ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మద్యం షాపును ఎక్సైజ్ పోలీసులు సందర్శించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినుకొండ అర్బన్, రూరల్, నూజెండ్ల, శావల్యాపురం మండలంలో 14 మద్యం షాపులు ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలు మేరకు ఫిర్యాదులు తావు లేకుండా మద్యం సీసాలు ఎమ్మార్పీ ధరలకు అమ్మకాలు పారదర్శకంగా చేయాలన్నారు. అన్నీ రకాల కంపెనీలకు చెందిన మద్యం సీసాలు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. రూ. 99 రూపాయలు మద్యం సీసా షాపుల్లో అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపితే అటువంటి షాపులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధలను మేరకు షాపులు సమయాభావం పాటించాలన్నారు. అన్నీ షాపుల ప్రాంగణంలో ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలంటూ ఫెక్సీలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం షాపులో రూ. 99 రూపాయల మద్యం సీసాను పరిశీలించి షాపు నిర్వాహకుడికి సూచనలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com